క్లుప్తంగా

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రికి సన్మానం



సన్మానిస్తున్న నాయకులు

జూలపల్లి: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆదివారం పెద్దపల్లిలో కార్యక్రమానికి హాజరై చొప్పదండికి వెళ్లేందుకు జూలపల్లి మీదుగా రాగా బీజేపీ జిల్లా కార్యదర్శి అమరగాని ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు ఆయనను సన్మానించారు. సింగిల్‌విండో డైరెక్టర్ గుమ్మడి శంకరయ్య, నాయకులు మేరుగు కనుకయ్య, దొడ్ల రాజయ్య, రమేశ్, కుమార్‌గౌడ్, న్యాతరి ఆశిష్, పెసరు రాజు, ఉమేశ్, రాయమల్లు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న నాయకులు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని జాఫర్‌ఖాన్‌పేట, ఇదులాపూర్, మంగపేట, పెద్దంపేట, లక్ష్మింపురం, ఆరెపల్లె, కిష్టంపేట, మొట్లపల్లి, పెద్దరాతుపల్లి గ్రామాల్లో ఆదివారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు చదువు రాంచంద్రారెడ్డి, గజవెల్లి పురుషోత్తం ప్రారంభించారు. రైతులు వరిధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. వైస్ చైర్మన్ కామిడి సంధ్య వెంకట్‌రెడ్డి, సీఈవోలు కోలేటి శ్రీనివాస్, విజేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, మాజీ ప్రజాప్రతినిధులు సతీశ్, దేవేందర్‌రావు, డైరెక్టర్లు జంగ శ్రీనివాస్‌రెడ్డి, కేతుపల్లి నరిసింహారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మే డే పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

రామగుండం: కార్మిక దినోత్సవం మే డే సందర్భంగా ఆదివారం అంతర్గాం మండల కేంద్రంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మే డే వేడుకలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఈ.నరేశ్, ఎడ్ల రవికుమార్, కొల్లూరి మల్లేశ్, బొంతు ఆనంద్, తిరుపతి, రమేశ్, సారయ్య, నల్ల తీగల రమేశ్, ఆలకుంట మల్లేశ్, దండు కుమార్, దేవయ్య, నసీరొద్దీన్ ఉన్నారు.

నేత్రదానం



సంపత్ (ఫైల్)

రామగిరి: గుండెపోటుతో మరణించినా ఆయన నేత్రాలు సజీవంగానే ఉన్నాయి. మండలంలోని బేగంపేటకు చెందిన చిప్ప సంపత్ శనివారం రాత్రి గుండెపోటుతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మృతి చెందాడు. సంపత్ నేత్రాలను దానం చేస్తే మరో ఇద్దరికి చూపు లభిస్తుందని ఆయన భార్య సంధ్య, కూతురు లక్ష్మీప్రసన్నకు వారి బంధువు సారయ్య, లయన్స్ క్లబ్ డైరెక్టర్, ఉమ్మడి కమాన్‌పూర్ మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి అవగాహన కల్పించగా వారు నేత్రదానానికి ముందుకు వచ్చారు. సదాశయ ఫౌండేషన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి వాసు ఆధ్వర్యంలో ఆదివారం ఎల్వీప్రసాద్ ఐబ్యాంక్ టెక్నీషియన్ ప్రదీప్ నాయక్ సహకారంతో నేత్రాలను సేకరించి హైదరాబాద్‌కు తరలించారు. కాంగ్రెస్ నాయకులు రొడ్డ బాపన్న, కొరుకొప్పుల తులసీరాంగౌడ్, సందెల కుమార్, కొత్తూరి మోహన్, దశరథం, మాదాసు శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న కాంట్రాక్టు అధ్యాపకుల సమ్మె



సమ్మెలో పాల్గొన్న కాంట్రాక్టు అధ్యాపకులు

రామగిరి: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ రాష్ట్ర కోఆర్డినేటర్స్ కమటీ పిలుపు మేరకు ఆదివారం మంథని జేఎన్టీయూ కళాశాల కాంట్రాక్టు అధ్యాపకులు రెండో రోజు సమ్మె నిర్వహించారు. తమ న్యాయమైన డిమాండ్లను అమలు చేయాలని, ఎన్నో ఏళ్లుగా కళాశాలలో పనిచేస్తున్నామని, తమ సేవలను గుర్తించి రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. రెగ్యులరైజ్ ఆలస్యమయ్యే పక్షంలో ఉద్యోగ భద్రతతో కూడిన ఇంక్రిమెంట్ అమలు చేయాలని కోరారు. సమ్మెలో కాంట్రాక్టు అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభావిత గ్రామాలపై పట్టింపు కరువు

- లాభాలు వచ్చినా అభివృద్ధి నిధుల కేటాయింపు శూన్యం
- ఉత్పత్తి ప్రారంభించి మూడేళ్లయినా పట్టించుకోని వైనం
- అధ్వానంగా ప్రధాన రహదారులు



ఆర్ఎఫ్‌సీఎల్ ప్రభావిత గ్రామాల్లో ప్రధాన రోడ్డు దుస్థితి

ఫెర్టిలైజర్‌సిటీ: 'పరిశ్రమలు వస్తే ప్రభావిత గ్రామాలు అభివృద్ధి చెందుతాయని పంట పొలాలు, ఇళ్ల స్థలాలు ఇచ్చాం. పరిశ్రమలు వచ్చిన ప్రభావిత గ్రామంలో అభివృద్ధి చెందడం లేదు' అని గ్రామస్తులు వాపోతున్నారు. రామగుండం కార్పొరేషన్ పరిధిలోని లక్ష్మీపురం, వీర్లపల్లి, విఠల్‌నగర్, ఎల్కలపల్లిగేట్ ప్రభావిత గ్రామాలు. ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం ఈ గ్రామాల్లో తాగునీరు, సీసీరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలి. ఆర్ఎఫ్‌సీఎల్ ప్లాంట్ ప్రారంభ సమయంలో 2015 మార్చి 11న ఆర్ఎఫ్‌సీఎల్ అధికారులు వీర్లపల్లిలో ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా కర్మాగారంలో ఉత్పత్తి మొదలుకాగానే ప్రభావిత గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు. కానీ ఉత్పత్తి ప్రారంభించి మూడేళ్లయినా అధికారులు ప్రభావిత గ్రామాల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

కుంటుపడిన అభివృద్ధి

రామగుండం ఫర్టిలైజర్స్ కెమికల్ లిమిటెడ్ కర్మాగారంలో 2023–24లో రూ.486కోట్ల ఆదాయం సాధించారు. 2024–25లో సుమారు రూ.550 కోట్ల ఆదాయం సాధిస్తామని అధికారులు అంచనా వేశారు. ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం ప్రభావిత గ్రామాల్లో అభివృద్ధికి నిధులు కేటాయించడంలో నిర్లక్ష్యం వహించడంతో ప్రభావిత గ్రామంలో అభివృద్ధి కుంటుపడింది. ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం స్పందించి గ్రామాల్లో మౌలిక వసతులపై దృష్టి సారించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలి



ఆర్ఎఫ్‌సీఎల్ కర్మాగారం ప్రభావిత గ్రామాల్లో ప్రజలు వేసవిలో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం స్పందించి ప్రభావిత గ్రామాల్లో ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేసి శుద్ధ జలాలను పంపిణీ చేయాలని ప్రభావిత గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

– దబ్బెట భానుచందర్, ఎల్కలపల్లిగేట్

రోడ్లు నిర్మించాలి



ఆర్ఎఫ్‌సీఎల్ కర్మాగారం నిర్మాణ క్రమంలో లక్ష్మీపురం కొత్త గేట్ నుంచి వీర్లపల్లి గ్రామాల మీదుగా వెళ్లే ప్రధాన రహదారి ప్లాంట్ నిర్మాణ క్రమంలో భారీ యంత్రాలు, కర్మాగార సామగ్రి ప్లాంటుకు చేరుస్తారు. భారీ వాహనాలు నడపడంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం స్పందించి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి.

– తాటికొండ రాజబాబు, లక్ష్మీపురం

వైద్యశిబిరం ఏర్పాటు చేయాలి



ఆర్ఎఫ్‌సీఎల్ కర్మాగారం నుంచి వెలువడే కాలుష్యంతో ప్రభావిత ప్రాంతాల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం స్పందించి ప్రభావిత గ్రామాలలో ప్రతీనెల మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయాలి.

– బాదె శ్రీనివాస్, వీర్లపల్లి

త్వరలోనే అభివృద్ధికి నిధులు కేటాయిస్తాం

రామగుండం ఎరువుల కర్మాగారం ఉత్పత్తి ప్రారంభించి మూడేళ్లు పూర్తయింది. 2023–24లో రామగుండం నగరపాలక సంస్థకు ప్రభావిత గ్రామాల అభివృద్ధికి రూ.25లక్షల నిధులు నగరపాలక సంస్థకు చెల్లించాం. 2024–25లో సుమారు రూ.550కోట్ల ఆదాయం సాధించే అవకాశం ఉంది. త్వరలోనే ప్రభావిత గ్రామాల అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు కేటాయించేలా కృషిచేస్తాం.

– ఉదయ రాజహంస, ఆర్ఎఫ్‌సీఎల్ సీజీఎం



కోల్‌సిటీ: గోదావరిఖనిలోని ఫైవింక్లయిన్ చౌరస్తా సమీపంలోని ప్రధాన రహదారి కల్వర్టు ప్రమాదకరంగా మారింది. నూతనంగా నిర్మించిన కల్వర్టుకు సమానంగా ఇరువైపులా సైడ్‌వాల్ నిర్మాణం చేపట్టలేదు. కనీసం మట్టి కూడా పోయిలేదు. దీంతో తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా రామగుండం బల్దియా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఫైట్ ఫర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేశ్ డిమాండ్ చేశాడు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

ప్రభుత్వ పాఠశాలల్లో వార్షికోత్సవం



సుల్తానాబాద్‌రూరల్: గర్రెపల్లి పాఠశాలలో..



కాల్వశ్రీరాంపూర్: నృత్యం చేస్తున్న విద్యార్థులు ఊశన్నపల్లె పఠశాలలో..

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం గర్రెపెల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం వార్షిక వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు, దేశభక్తి చాటిచెప్పే ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది. హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, స్కూల్ కాంప్లెక్ హెచ్‌ఎం కవిత, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని ఊశన్నపల్లె ప్రభుత్వ పాఠశాలలో వార్షిక వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు ఆహుతులను అలరించాయి. ఎంఈవో మహేశ్ కుమార్, హెచ్‌ఎం సమ్మయ్య, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



పోచమ్మ బోనాలతో మహిళలు

గోదావరిఖనిటౌన్: గోదావరిఖనిలో గౌడ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో శోభాయాత్రగా స్థానిక ప్రధాన చౌరస్తా సమీపంలోని పోచమ్మ గుడికి వెళ్లారు. పోచమ్మకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ చైతన్యపురి కాలనీలో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ సతీమణి మనాలి ఠాకూర్ పాల్గొని పోచమ్మకు బోనం సమర్పించారు. కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైకుంఠపతి ఆశయసాధనకు కృషిచేయాలి



నివాళి అర్పిస్తున్న నాయకులు

సుల్తానాబాద్: బీఆర్ఎస్ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పారుపెల్లి వైకుంఠపతి ఆశయ సాధన కోసం కృషి చేయాలని పార్టీ పట్టణ అధ్యక్షుడు గణపతి కోరారు. మండల కేంద్రంలో ఆదివారం వైకుంటపతి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పలువురు మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం అత్యధిక రోజులు సుల్తానాబాద్‌లో రిలే నిరహార దీక్షలు కొనసాగించిన ఘనత వైకుంఠపతికే దక్కిందని కొనియాడారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, వృద్ధులకు పండ్లు, పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. నాయకులు బైరగోని ప్రభాకర్, శ్రీనివాస్, అంజన్న, సర్వేశ్, ప్రభాకర్, వెంకటేశ్, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

మగ ధాన్యం కొనుగోలు చేయాలి

ముత్తారం: మండలంలో ఆడ, మగ సీడ్ వరిని రైతులు అధికంగా పండించారని, మగధాన్యాన్ని ఐకేపీ, పీఏసీఎస్ కొనుగోలు చేయాలని మాజీ ఎంపీపీ అత్తె చంద్రమౌళి కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మగ ధాన్యాన్ని కొనుగోలు చేసి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మగ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేశారని ఆయన గుర్తు చేశారు.

ప్రమాదవశాత్తు ఉనుక లారీ బోల్తా

ముత్తారం: మండలంలోని ఓడెడ్ మానేరులో తాత్కాలిక మట్టి రోడ్డుపై ఆదివారం ప్రమాదవశాత్తు ఉనుక లారీ బోల్తాపడింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల నుంచి పెద్దపల్లికి వస్తుండగా ఓడెడ్ మానేరులో మట్టిరోడ్డుపై టైరు కిందికి దిగడంతో ప్రమాదవశాత్తు బోల్తా పడింది. లారీలో ఉన్న డ్రైవర్, నలుగురు కూలీలకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎస్సై స్వామి

పాలకుర్తి: క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం, స్నేహభావం పెంపొందుతుందని బసంత్‌నగర్ ఎస్సై ఆర్.స్వామి అన్నారు. మక్కాన్‌సింగ్ సేవాసమితి, బసంత్‌నగర్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో బసంత్‌నగర్ వర్కర్స్ క్లబ్‌లో అంతర్గాం, పాలకుర్తి రెండు మండలాల స్థాయి ×రాజన్న ప్రీమియర్ లీగ్‌×ౕ క్రికెట్ టోర్నమెంట్‌ను మక్కాన్‌సింగ్ సేవాసమితి అధ్యక్షురాలు మనాలి ఠాకూర్‌తో కలిసి ఎస్సై ప్రారంభించారు. ఎస్సై మాట్లాడుతూ మొత్తం 34 జట్లు పాల్గొంటున్న ఈ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన జట్టుకు రూ.30వేలు, రన్నర్ జట్టుకు రూ.15వేల నగదుతో పాటు ట్రోఫీ అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

జూలపల్లి: వరంగల్‌లోని ఎల్కతుర్తిలో ఈ నెల 27న బీఆర్ఎస్ నిర్వహించే ఛలో వరంగల్ రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ నాయకులు నిట్టు కొమురయ్య కోరారు. మండలంలోని అబ్బాపూర్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ సభ పోస్టర్‌ను ఆదివారం పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. మాజీ సర్పంచ్ ఈర్ల మల్లేశం, గాండ్ల చంద్రయ్య, పసునూటి శ్రీనివాస్, మహేశ్, జంగం సతీశ్, బొంగాని వీరేశం తదితరులు ఉన్నారు.

సుల్తాన్‌పూర్‌లో ఉచిత వైద్యశిబిరం

ఎలిగేడు: మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో హైదరాబాద్‌లోని సోమాజీగూడ యశోద హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆర్థోపెడిక్ వైద్యులు సునీల్ దాచేపల్లి, ఆర్థోపెడిక్ కార్డియాలజీ జయదీప్, జనరల్ ఫిజీషియన్ నిఖిల్ సాయి బృందం ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలోని ప్రజలకు బీపీ, రక్త పరీక్షలు, ఈసీజీ వంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

మంథని: పట్టణంలో ఆదివారం అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రతలపై ఫైర్ సిబ్బంది అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అగ్నిమాపక సిబ్బందికి నివాళి అర్పించారు. బస్టాండ్, పార్క్, పాఠశాలలు, సినిమా థియేటర్లు, ఫంక్షన్ హాళ్లు, ఆసుపత్రులు, ఇండస్ట్రీస్, గ్యాస్ గోడౌన్ల యాజమాన్యాలకు అవగాహన కల్పించినట్లు అధికారి శివశంకర వరప్రసాద్ తెలిపారు. లీడింగ్ ఫైర్‌మెన్‌లు సదానందం, దేవేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

పేరెంట్ మినీ ఒలింపిక్స్ ప్రారంభం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖనిటౌన్: స్థానిక రమేశ్‌నగర్‌లోని వాసవ్య విద్యాలయం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం పిల్లల తల్లిదండ్రులకు మినీ ఒలింపిక్స్ పేరిట ఆటల పోటీలు నిర్వహించారు. సింగరేణి ఆర్జీ–1 జీఎం లలిత్ కుమార్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. మాజీ జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి, హెచ్‌ఎం బండారి రాజమల్లు, మేజిక్ రాజా, హ్యాండ్ రైటింగ్ నిర్వాహకుడు అహ్మద్, మాతంగి సునీత, పాఠశాల డైరెక్టర్ విక్రమ్‌వర్మ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం





సమ్మేళనంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థులు, అమరేశ్వర్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

కరీంనగర్: గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల 2001–04 బ్యాచ్‌కు చెందిన బీకాం విద్యార్థులు ఆదివారం కరీంనగర్‌లోని మైత్రి హోటల్ వేదికగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. వివిధ రంగాల్లో స్థిర పడిన వారు పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అమరేశ్వర్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు..

గోదావరిఖనికి చెందిన అమరేశ్వర్ హైస్కూల్ 1999–2000 విద్యాసంవత్సరం పదో తరగతి విద్యార్థులు ఆదివారం కరీంనగర్‌లోని కొండా సత్య లక్ష్మి గార్డెన్ వేదికగా గెట్ టు గెదర్ ఏర్పాటు చేసుకున్నారు. ఇంజినీర్లు, టీచర్లు, లెక్చరర్లు, వ్యాపారవేత్తలు..ఇలా ఒక్కో రంగంలో స్థిరపడ్డ 60 మంది విద్యార్థులు ఒకే చోట కలుసుకుని చిన్ననాటి అనుభవాలను పంచుకున్నారు. తమ జీవితంలో ఎదుగుబొదుగులు, ఇప్పుడున్న స్థితిగతులన్నీ ముచ్చటించుకున్నారు. ఫొటోల రూపంలో శాశ్వత జ్ఞాపకంగా మల్చుకున్నారు. ఈ కార్యక్రమంలో విజయ్, రవి, తిరుపతి, నాగవర్ణ, కళావతి పాల్గొన్నారు.



ఓదెల: పూర్వ విద్యార్థులు

ఓదెల: ఓదెల ప్రభుత్వ పాఠశాలలో 1999–2000లో పదో తరగతి చదివిన 120మంది పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు నాగపురి రాజు, అరుకాల తిరుపతి, డాక్టర్ బిక్షపతి, నూతి శంకర్, మిట్టపల్లి శంకర్, నాగవెల్లి శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, కుమార్, వెంకటేశ్, సంధ్య, కల్పన, రూప, సునీత, జ్యోతి ఆధ్వర్యంలో అప్పటి ఉపాధ్యాయులు రంగారావు, గిరిధర్, మల్లారెడ్డి, విజయ్‌కుమార్, ప్రొఫెసర్ నతానియల్, రాజ్‌కుమార్, పల్కపాటి రాజేశ్‌కుమార్, తీర్థాల సదానందంను సన్మానించారు. అనంతరం నృత్యాలతో ఆటపాటలతో ఆనందంగా గడిపారు.

ఏసు బోధనలు మానవాళికి మార్గదర్శకం



మాట్లాడుతున్న దుద్దిళ్ల శ్రీనుబాబు

మంథని: ఏసుక్రీస్తు బోధనలు ఒక మతానికి సంబంధించినవి కావని, యావత్తు మానవాళికి మార్గదర్శకమని శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు అన్నారు. ఈస్టర్ సందర్భంగా ఆదివారం మంథని పట్టణంలోని ఎరుకల గూడెం బేతల్ గాస్పల్ ప్రేయర్ మినిస్ట్రీస్‌లో జరిగిన పునరుత్థాన ఆరాధనలో ఆయన పాల్గొని మాట్లాడారు. అందరూ సుఖసంతోషాలతో ఉండాలన్నదే ఏసుక్రీస్తు బోధనల సారాంశం అని అన్నారు. మరణంపై ఏసు సాధించిన విజయానికి గుర్తుగా సమస్త మానవాళి ఈస్టర్ పండుగను ఘనంగా జరుపుకుంటారన్నారు. పాస్టర్ ఐతు ఎలీషా, ఎంసీపీఎప్ అధ్యక్షుడు ఐతు డేవిడ్, లూకా పాల్గొన్నారు.

ఎల్లంపల్లి ప్రాజెక్టు కార్మికులకు అందని వేతనాలు

రామగుండం: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు కార్మికులు ఐదునెలలుగా వేతనాలు అందకపోవడంతో 18 కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. చాలీచాలని జీతంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్న క్రమంలో ప్రతీ నెల వచ్చే వేతనం కూడా సకాలంలో చెల్లించకపోవడంపై కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 9మంది గేట్ మెన్స్ కాగా, 9 మంది సెక్యూరిటీ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ విషయమై ప్రాజెక్టు డీఈ బుచ్చిబాబును వివరణ కోరగా వేతనాల చెల్లింపుల్లో జాప్యం జరుగుతున్న విషయం వాస్తవమేనని, సెక్యూరిటీ ఏజెన్సీకి ప్రభుత్వం నుంచి డబ్బులు రాలేదని పేర్కొంటున్నట్లు తెలిపారు. కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించేలా సదరు ఏజెన్సీపై ఒత్తిడి తీసుకువచ్చి కార్మికులకు న్యాయం చేస్తానని పేర్కొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెద్దపల్లి జిల్లా: 9951602934
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
పెద్దపల్లి: కె.తిరుపతి, ACO - 7997958206
పెద్దపల్లి: ఎం.మహేందర్, SR - 9573331940
మంథని: రాజేశ్ - 9676603963
రామగుండం: ప్రశాంత్ - 9652397696
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899